క్లుప్తంగా

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



అభయాంజనేయస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న అర్చకులు

పెదపాడు: అప్పనవీడులోని అభయాంజనేయ స్వామి ఆలయంలో పునర్వసు నక్షత్రం సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వెనుక భాగాన కల్యాణ వేదిక వద్ద ఏర్పాటు చేసిన వేదికపై స్వామికి పండ్ల రసాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. ఈకార్యక్రమంలో పలువురు భక్తులు పాల్గొన్నారు.

నులిపురుగు నివారణ మందు పంపిణీకి ఏర్పాట్లు

గణపవరం: జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 10న ప్రభుత్వం అందించే ఆల్‌బెండాజోల్ మాత్రలను 18 ఏళ్లలోపు వయస్సు కలిగిన ప్రతిఒక్కరూ వేసుకోవాలని గణపవరం ఎంపీడీవో జ్యోతిర్మయి, వైద్యాధికారులు సంతోష్‌నాయుడు, కిరణ్మయి అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయంలో డీవార్మింగ్ డే సందర్భంగా చేయాల్సిన ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. విద్యాలయాల్లోని విద్యార్థులందరికీ ఆల్‌బెండాజోల్ మాత్రలు పంపిణీ చేస్తామని వైద్యాధికారి సంతోష్‌నాయుడు తెలిపారు. ఈకార్యక్రమంలో వైద్యసిబ్బంది, పంచాయతీరాజ్ సిబ్బంది పాల్గొన్నారు. ఈసందర్భంగా డీవార్మింగ్ డే పోస్టర్లను విడుదల చేశారు.

గణపవరాన్ని స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దాలి

గణపవరం: గణపవరం గ్రామాన్ని సంపూర్ణ పారిశుద్ధ్య గ్రామంగా తీర్చిదిద్దడానికి గ్రామ ప్రజలంతా సహకరించాలని వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కాకర్ల శ్రీను అన్నారు. గణపవరం సచివాలయం -2 పరిధిలోని చిన రామచంద్రపురం వైఎస్సార్ కాలనీవాసులకు శనివారం తడి,పొడి చెత్త వేయడానికి ఇంటింటికీ రెండు డస్ట్‌బిన్‌లను పంపిణీ చేశారు. గ్రామంలో అన్ని ఇళ్లకు చెత్తసేకరణకు డస్ట్‌బిన్‌లు అందిస్తామన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు కొండేటి వెంకటరత్నం, అడపాత్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక స్వావలంబన సాధించాలి

పెదవేగి : ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తున్న పెరటి కోళ్లతో ఆర్థిక స్వావలంబన సాధించే దిశగా మహిళలు శ్రద్ధ వహించాలని పెదవేగి ఎంపీపీ తాతా రమ్య అన్నారు. శనివారం పెదవేగిలో స్వయం సహాయక సంఘాల మహిళలకు పెరటి కోళ్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీపీ తాతా రమ్య మాట్లాడుతూ పెదవేగి మండలంలో 97 పెరటి కోళ్ల యూనిట్‌లను పంపిణీ చేశామన్నారు. ఒక్కో యూనిట్ విలువ రూ.4,450 లబ్ధిదారులు చెల్లించాలని చెప్పారు. యూనిట్‌లో 12 కోళ్లు అందిస్తామని ఆమె చెప్పారు. కోళ్లతో పాటు ప్రతి లబ్ధిదారులకు 30 కిలోల దాణా, మందులు అందిస్తామని ఎంపీపీ పేర్కొన్నారు. మండలంలో కొప్పాక, విజయరాయి, పెదవేగి, వేగివాడ 4 గ్రామాల్లో కోళ్ల పంపిణీ కార్యక్రమం చేపట్టామని ఎంపీపీ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం బట్టు శరత్‌బాబు, సీఏలు, డ్వాక్రా సంఘాల మహిళలు పాల్గొన్నారు.

వీఆర్‌ఏల సమస్యలపై వినతి

గణపవరం: వీఆర్‌ఏల సమస్యలు పరిష్కరించాలని సంఘం గణపవరం మండలశాఖ అధ్యక్షుడు ఎరిచర్ల వెంకట్రావు డిమాండ్ చేశారు. సమస్యలతో కూడిన వినతిపత్రం తహసీల్దార్‌కు శనివారం అందజేశారు. తమ సమస్యల సాధనకోసం ఈనెల 7, 8 తేదీల్లో చేపట్టనున్న నిరాహార దీక్షలకు అనుమతి ఇవ్వాలని కోరారు. ఈకార్యక్రమంలో సంఘం సభ్యులంతా పాల్గొన్నారు.

విగ్రహాల ఏర్పాటుకు సన్నాహాలు

ఉంగుటూరు: నారాయణపురం ఎస్ఎఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల గోల్డెన్ జూబ్లీ వేడుకల నేపథ్యంలో విగ్రహాల ఏర్పాటుపై శనివారం చర్చించారు. ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరావు అధ్యక్షతన పూర్వవిద్యార్థులు సమావేశమయ్యారు. కరపత్రం తయారీ అంశంపై చర్చించారు. పూర్వవిద్యార్థులు బొమ్మిడి అప్పారావు, పరిమి రాఘవులు, కోనా శ్రీనివాసరావు, కూనా అప్పారావు పాల్గొన్నారు.

8న పాస్టర్ల శాంతి ర్యాలీ

దెందులూరు: మండలంలో ఈ నెల 8న యూనిటైడ్ పాస్టర్స్ వెల్ఫేర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో మణిపూర్‌లో జరుగుతున్న దాడులు, విధ్వంసం, హింసను ఖండిస్తూ శాంతి ర్యాలీ నిర్వహిస్తున్నామని అసోసియేషన్ నాయకులు తెలిపారు. దెందులూరులోని 9వ వార్డు నుంచి బస్టాండ్ సెంటరులో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు శాంతి ర్యాలీ నిర్వహిస్తామని వివరించారు. మణిపూర్‌లో శాంతి నెలకొనేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు.

పేదల అభ్యున్నతే లక్ష్యంగా పథకాల అమలు

- ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి
- వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు పంపిణీ

పెదపాడు: పేదల అభ్యున్నతే పథకాల లక్ష్యమని, అంగన్‌వాడీల ద్వారా గర్భిణులకు, బాలింతలకు ఇంటికే రేషన్ అందిస్తున్నట్లు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి తెలిపారు. పెదపాడు సొసైటీలో నిర్వహించిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ (టేక్ హోం రేషన్) కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించి లబ్ధిదారులకు కిట్లను పంపిణీ చేసారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి పాలనలో పుట్టబోయే బిడ్డ నుంచి వృద్ధుల వరకూ అన్ని వర్గాల ప్రజలకు వివిధ పథకాలు అమలు చేస్తూ వారి అభ్యున్నతే లక్ష్యంగా ఎన్నో విధాలుగా అండగా నిలుస్తున్నారని గుర్తు చేసారు. వైఎస్సార్ సంపూర్ణ పోషణ ప్లస్ కార్యక్రమాల ద్వారా మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో పౌష్టికాహార వస్తువులు, పదార్థాలతో కూడిన కిట్‌ను గర్భిణులు, బాలింతలకు అందిస్తున్నామని చెప్పారు. 3కిలోల బియ్యం, కిలో కందిపప్పు, అర కిలో నూనె, 2 కిలోల రాగిపిండి, గుడ్లు 25, పాలు 5 లీటర్లు, కిలో అటుకులు, పావు కిలో వేరుశనగ చిక్కి, పావు కిలో ఎండు ఖర్జూరం, కిట్ రూపంలో అందిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా గర్భిణులకు నిర్వహించిన సీమంతం కార్యక్రమంలో ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పాల్గొని వారిని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైస్ మిల్లర్స్ అసోషియేషన్ అధ్యక్షుడు ఆళ్ల సతీష్‌చౌదరి, ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్, వైస్ ఎంపీపీ రెడ్డి స్వర్ణకుమారి, సర్పంచ్ కొత్తూరు జీవనకుమారి లబ్ధిదారులనుద్దేశించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీవో ఎస్ నిర్మలజ్యోతి, సీడీపీవోలు విజయలక్ష్మి, సునీల్ రాజశేఖర్ నాయకులు అధికారులు పాల్గొన్నారు. గర్భిణులు, బాలింతలకు 120 మందికి రూ.లక్ష విలువైన చీరలు పంపిణీ చేసినట్లు పెదపాడు సొసైటీ అధ్యక్షుడు అక్కినేని రాజశేఖర్ తెలిపారు.



పెదపాడులో వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి



ముప్పవరంలో కిట్లను అందజేస్తున్న సర్పంచ్ మెండేం సంతోష్‌కుమార్, ఉపసర్పంచ్ ముకుంద



పూళ్లలో సంపూర్ణ పోషణ పథకం కిట్లను అందిస్తున్న సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్

దెందులూరు మండలంలో..

దెందులూరు: ముప్పవరం గ్రామ పంచాయతీలో శనివారం వైఎస్సార్ సంపూర్ణ పోషణ టేక్ హోం రేషన్ పంపిణీని సర్పంచ్ మెండేం సంతోష్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు సర్పంచ్ సంతోష్, ఉపసర్పంచ్ ముకుంద, అంగన్‌వాడీ సిబ్బంది అందజేశారు. అంగన్‌వాడీ సిబ్బంది, గర్భిణులు, బాలింతలున్నారు. గోపన్నపాలెంలో సర్పంచ్ కోటే నాగమల్లేశ్వరి కుమార్, పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ రోజా శనివారం పోతునూరు గ్రామ పంచాయతీ కార్యాలయంలో, వైద్యశాలలో, అంగన్‌వాడీ కేంద్రాల్లో, వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను అందజేశారు.

సంపూర్ణ పోషణ పథకం మహిళలకు వరం

భీమడోలు: సంపూర్ణ పోషణ పథకం పేద మహిళల పాలిట వరమని పూళ్ల సర్పంచ్ దాయం సుజాత ప్రసాద్ అన్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని రెడ్డి నాయుడుపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద శనివారం గర్భిణులు, బాలింతలకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. వైద్య ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

దెందులూరు సర్పంచ్, కార్యదర్శికి లోక్ అదాలత్ నోటీసులు

దెందులూరు: దెందులూరు సర్పంచ్, గ్రామ కార్యదర్శికి లోక్ అదాలత్ నోటీసులు జారీ చేసింది. శనివారం దెందులూరులో వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు, ఏఎంసీ డైరెక్టర్ పులిపాటి శ్యామలాదేవి మాట్లాడుతూ దెందులూరు గ్రామ పంచాయతీలో రాష్ట్ర పంచాయతీ రాజ్ యాక్ట్‌కు విరుద్ధంగా నిబంధనలు విస్మరించి సర్పంచ్, ఆమె భర్త , మరో ముగ్గురు బ్యాంకు అకౌంట్లకు పంచాయతీ నిధులు జమ చేసుకున్నారని, రెండున్నరేళ్లుగా దెందులూరు శివారు గ్రామాలైన అలుగులగూడెం, సత్యనారాపురం, అప్పారావుపాలెం గ్రామాల్లో వసూలు చేసిన పన్నులకు సంబంధించిన నగదు పూర్తిస్థాయిలో రికార్డుల్లో లెక్కలు లేకపోవడం, ట్రెజరీకి జమ చేయకపోవడంతో తాము లోక్‌అదాలత్‌ను ఆశ్రయించామన్నారు. లోక్‌అదాలత్ సీనియర్ జడ్జి 189 ఫిర్యాదుగా నమోదు చేసి దెందులూరు సర్పంచ్, కార్యదర్శికి నోటీసులు జారీ చేశారు. సెప్టెంబర్ 5న ఇద్దరు కోర్టుకు హాజరుకావాలని ఏసుబాబు, శ్యామలాదేవి అన్నారు. 22 రోజుల క్రిందట రికార్డులను అధికారులు సీజ్ చేసి ఏలూరుకు తీసుకువెళ్లిన విషయం విదితమే.

కొబ్బరికి గిట్టుబాటు ధర కల్పించాలి

పెదవేగి : కొబ్బరి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని,కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం కార్యదర్శి బొల్లి రామకృష్ణ, ఉపాధ్యక్షుడు మున్నంగి సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. ఈనెల 8న మండలంలోని విజయరాయిలోని ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం యార్డు ఆవరణలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న కొబ్బరి రైతుల జిల్లా సదస్సు కరపత్రాలను శనివారం విడుదల చేశారు. విజయరాయిలో ప్రాంతీయ కొబ్బరి రైతుల సంఘం కార్యాలయం ఆవరణలో శనివారం ఈ కార్యక్రమం నిర్వహించారు. కొబ్బరి రైతులకు ధరల స్థిరీకరణ పథకం వర్తింపజేయాలని కోరారు. నాఫెడ్, ఆయిల్ ఫెడ్ ద్వారా కొబ్బరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కొబ్బరికాయలను ప్రభుత్వమే కొనుగోలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గుది బండి రమేష్ రెడ్డి, భీమవరపు రామిరెడ్డి,కళ్లెం శివారెడ్డి, బొప్పన వీర వెంకట సుబ్బారావు, వట్టికూటి రామావతారం, కొబ్బరి రైతులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ స్థాపనే మానవత లక్ష్యం

భీమడోలు: ఉత్తమ సమాజ స్థాపనే మానవతా లక్ష్యమని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఉమ్మడి జిల్లా చైర్మన్ రామిశెట్టి గంగాధరరావు అన్నారు. పూళ్ల పంచాయతీ పరిధిలోని ఎంఎంపురంలో శనివారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ మండల నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. మండల అధ్యక్షుడు వట్టి సుగుణాకరరావు అధ్యక్షత వహించిన సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉమ్మడి జిల్లాల చైర్మన్ రామిశెట్టి గంగాధరరావు పాల్గొని ప్రసంగించారు. సేవాలక్ష్యంగా మానవత సభ్యులు పని చేయాలని కోరారు. పూళ్ల గ్రామానికి చెందిన క్యాన్సర్‌తో బాధపడుతున్న వ్యక్తికి రూ.5వేల ఆర్థిక సాయాన్ని అందించారు. మండల కన్వీనర్ పంచకర్ల సత్యనారాయణ, మండల చైర్మన్ గుల్ల నూకరాజు, ఏఎంసీ ఉపాధ్యక్షుడు పులిచర్ల వెంకట కృష్ణారావు, డైరెక్టర్ కేతినీడి విశ్వేశ్వరరావు, ప్రతినిధులు అల్లాడ ప్రసాదరావు పాల్గొన్నారు.

టీడీపీ నేత వైద్యానికి రూ.10 లక్షల సీఎం సహాయ నిధి

దెందులూరు: కుల,మత, వర్గం, పార్టీరహితంగా రోగాల బారిన పడిన వారికి చికిత్స నిమిత్తం సీఎం సహాయ నిధి మంజూరు చేస్తున్నట్టు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి అన్నారు. పోతునూరులో అనారోగ్యంతో బాధపడుతున్న టీడీపీ నేత చావల శివరావును ఆదుకునేందుకు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి సకాలంలో స్పందించి సాయం అందించారు. కొంతకాలంగా శివరావు కాలేయ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. వైద్యులు కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స చేయించాలని, అందుకు రూ. 10లక్షలు అవసరమవుతాయని సూచించారు. శివరావు పోతునూరుకి చెందిన వైఎస్సార్ సీపీ నేతలు డీఎస్‌వీ ప్రసాద్ (బజ్జీ), సర్పంచ్ బోదుల స్వరూప్‌కు చెప్పడం నేతలు వెంటనే ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి దృష్టికి తీసుకువెళ్లారు. సకాలంలో స్పందించిన ఎమ్మెల్యే అమరావతి వెళ్లి ముఖ్యమంత్రికి శివరావు కాలేయ మార్పిడి శస్త్ర చికిత్స విషయం వివరించారు. ముఖ్యమంత్రి వెంటనే స్పందించి రూ. 10 లక్షల విడుదలకు సంబంధించి ఎల్‌ఓసీని 24 గంటలలోపే ఎమ్మెల్యేకి అందజేశారు. ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పోతునూరులో బాధితుడు శివరావు, తండ్రి చావల ధర్మారావు, కుమారుడు మణికంఠకు చెక్కును అందజేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని, సొసైటీ చైర్మన్ డీఎస్‌వీ ప్రసాద్ (బజ్జీ), సర్పంచ్ బోదుల స్వరూప్, రేషన్ డీలర్ల జిల్లా అధ్యక్షుడు తలారి వెంకట్రావు, బట్రాజు సత్యనారాయణ, నాయకులున్నారు. అనంతరం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరికి, సీఎం వైఎస్ జగన్‌కు బాధిత కుటుంబ సభ్యులు శివరావు, ధర్మారావు, మణికంఠ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



పోతునూరులో టీడీపీ నేత చావల శివరావుకు సీఎం సహాయ నిధి పత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే కొఠారు

సంక్షేమ పాలనతో అన్ని వర్గాలకు మేలు

- ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు
- పెదనిండ్రకొలనులో గడపగడపకు మన ప్రభుత్వం

నిడమర్రు: ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో అన్ని వర్గాలకు సంక్షేమ పాలన చేరువ చేశారని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. పెదనిండ్రకొలనులో చేపట్టిన గడపగడపకు మన ప్రభుత్వం శనివారంతో ముగిసింది. నియోజకవర్గంలో చేపట్టిన ఈ కార్యక్రమం 188వ రోజుకు చేరుకుందని మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వాసుబాబు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకుంటూ లబ్ధిదారులకు సంక్షేమ బ్రోచర్లను అందించి వారికి అందిన పథకాలను వివరించారు. సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రభుత్వ పరిపాలనను ప్రతి కుటుంబానికి తీసుకువెళ్లడంతో ప్రథకాల లబ్ధిని నేరుగా అర్హుల ఖాతాల్లో జమ చేస్తున్నామని ఎమ్మెల్యే అన్నారు. ముఖ్యమంత్రి ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాల అమలుపై ప్రజలంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్న ముఖ్యమంత్రి జగన్‌ను ప్రజలు వచ్చే ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే వాసుబాబు ఓటర్లను కోరారు. స్థానికులు చెప్పిన సమస్యలు తక్షణం పరిష్కరించేలా ఎమ్మెల్యే వాసుబాబు గ్రామ సచివాలయ సిబ్బందికి సూచనలు జారీ చేసారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కోడే కాశి, వైస్ ఎంపీపీ బండి రమణవిస్సాకు, పార్టీ అధ్యక్షుడు కోడూరి రాంబాబు, ఎంపీటీసీ చినమిల్లి నరసింహమూర్తి, సొసైటీ అధ్యక్షుడు దాట్ల శివవర్మ, ఆవాల రాంబాబు, విప్పర్తి మధు, బెవర రాంబాబు, వేగేశ్న సుబ్బరాజు, అల్లాడి అబ్బులు, పుప్పాల కొండయ్య, నక్కా రామకృష్ణ, చినిమిల్లి శ్రీను, దాసరి సురేష్, కొంచాడ గోవిందరావు, చినిమిల్లి రాంబాబు, కోటి నరసింహరావు, కోటి గోవింద్, బద్ది రెడ్డి సుబ్రహ్మణ్యం, పోతురాజు భీమన్న తదితరులున్నారు.



పెదనిండ్రకొలనులో పథకాలను లబ్ధిదారులకు వివరిస్తున్న ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు

రోడ్ల నిర్మాణాలకు రూ.30 కోట్ల మంజూరు

- రోడ్లు నిర్మిస్తారని తెలిసి ముందస్తుగా తప్పుడు ప్రచారం
- జనసేన పాదయాత్రలపై మండిపడ్డ వైఎస్సార్ సీపీ శ్రేణులు

నిడమర్రు: నిధులు మంజూరై రోడ్ల నిర్మాణ పనులు ప్రారంభించే ముందు జనసేన పార్టీ నేతలు ఆయా రోడ్లపై గుంతలున్నాయంటూ పాదయాత్రలు చెయ్యడం రాజకీయ దురుద్దేశ్యంతోనే అని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంకు సత్యకుమార్ అన్నారు. శనివారం బువ్వనపల్లిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో పలు గ్రామాల పార్టీ నేతలు మాట్లాడారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ ఉంగుటూరు నియోజకవర్గంలో రూ.30 కోట్లతో ఆర్‌అండ్‌బీ, పంచాయతీ రాజ్ నిధులు మంజూరవ్వడమే కాకుండా టెండర్లు ప్రక్రియ పూర్తి చేసుకుని వర్షాలు తగ్గిన వెంటనే పనులు ప్రారంభించేందుకు సిద్ధంగా ఉన్న సమయంలో ఆయా రోడ్లపై జనసేన నేతలు రోడ్లు బాగోలేదంటూ, ప్రభుత్వం పట్టించుకోవడం లేదంటూ పాదయాత్రలు చెయ్యడం హాస్యాస్పదంగా ఉందన్నారు. నియోజకవర్గంలో పంచాయతీరాజ్ రోడ్లకు భీమడోలు, నిడమర్రు మండలాలు కలిపి ఒక ప్యాకేజీలో రూ.10 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ఆర్‌అండ్‌బీ రహదారుల అభివృద్ధికి నిధులు మంజూరై టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకుని నవంబర్‌లో పనులు ప్రారంభించనున్నట్లు సత్యకుమార్ తెలిపారు. పంచాయతీరాజ్ నిధులతో పల్లపూరు-పత్తేపురం, లింగంపాడు రోడ్డు, భీమడోలు కూరెళ్లగూడెం రోడ్డు వయా వడ్డపట్ల, పాతూరు-సూరప్పగూడెం రోడ్లు, గుండుగొలను గోపాల్ వీల్స్ రోడ్డు, పూళ్ల- కొండ్రుపాడు, మండలపర్రు- గుణపర్రు, నిడమర్రు కొల్లేరు రోడ్డు, నిడమర్రు కొల్లేరు రోడ్డు, గోపవరం రోడ్డు, క్రొవ్విడి కొల్లేరు రోడ్డు, పెదనిండ్రకొలను పెద్దింట్లమ్మ రోడ్డు, నాగులమిల్లి రహదారుల అభివృద్ధి చేపట్టనున్నారన్నారు. ఆర్‌అండ్‌బీ రోడ్ల టెండర్లు దూబచర్ల-గణపవరం రోడ్డుకు రూ.10కోట్లు, బువ్వనపల్లి- అడవికొలను రోడ్డుకు రూ.2కోట్లు, వీరేశ్వరపురం నుంచి వల్లూరు రోడ్డుకు రూ.1.80 కోట్లు, అర్ధవరం రోడ్డుకి రూ.కోటి, ఆగడాలంక - మల్లవరం, పిప్పర - భీమవరం రోడ్లకు నిధులు విడుదలవడంతో టెండర్లు పూర్తయినట్లు సత్యకుమార్ తెలిపారు.

గతంలోనే ఎమ్మెల్యే పాదయాత్ర

అడవికొలను రహదారి అభివృద్ధి చెయ్యాలని గతంలోనే ఎమ్మెల్యే వాసుబాబు పాదయాత్ర చేసిన విషయం జిల్లా సర్పంచ్‌ల చాంబర్ ఉపాధ్యక్షుడు పుప్పాల మెహర్‌కుమార్ గుర్తు చేశారు. కరోనాతో రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ప్రజల సంక్షేమానికే సీఎం జగన్ తొలి ప్రాధాన్యత ఇచ్చారని అన్నారు. గతేడాది నుంచి అన్ని రహదారులను అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో అడవికొలను నీటి సంఘం అధ్యక్షుడు నిమ్మల బుజ్జి, పార్టీ అధ్యక్షుడు పాపోలు సుబ్బారావు, ఆర్‌బీకే చైర్మన్ పాపోలు సుబ్బయ్య, నిమ్మల రమేష్, నేతి ప్రసాదు తదితరులున్నారు.



బువ్వనపల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతున్న సంకు సత్యకుమార్

ఇళ్ల స్థలాల పంపిణీలో దేశంలోనే సరికొత్త రికార్డు

గణపవరం: పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయడంలో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే సరికొత్త రికార్డు నెలకొల్పిందని ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. గణపవరం మండలం అగ్రహార గోపవరం, డి.కుముదవల్లి గ్రామాలకు చెందిన లబ్ధిదారులకు ఆయన క్యాంపు కార్యాలయంలో వైఎస్సార్ జగనన్న కాలనీలో ఇళ్ల స్థలాల పట్టాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ దాదాపు 32 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు అందించిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో దాదాపు అన్ని గ్రామాల్లో వైఎస్సార్ జగనన్న కాలనీల పేరుతో కొత్త ఊళ్లు ఏర్పడుతున్నాయన్నారు. ఈ సందర్భంగా రెండు గ్రామాల్లోని లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేశారు. ఈకార్యక్రమంలో సర్పంచ్‌లు పాతంశెట్టి పద్మాశ్రీను, తూము వీరవేణి, పార్టీనాయకులు వడ్డి ఉమ,దూలం రామకృష్ణ, మండల వైఎస్సార్ సీపీ కన్వీనర్ దండు రాము పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల స్థలాల పట్టాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వాసుబాబు

మణిపూర్ బాధితులకు అండగా నిలవాలి

భీమడోలు: మణిపూర్ రాష్ట్రంలో మారణహోమాన్ని ఖండిస్తూ, బాధితులకు అండగా సంఘీభావం తెలియజేసేందుకు ఈనెల 8వ తేదీ మంగళవారం నిర్వహించే శాంతి ర్యాలీలో ప్రజలంతా పెద్ద ఎత్తున పాల్గొనాలని మండల లౌకిక రాజ్యాంగ పరిరక్షణ వేదిక రౌండ్ టేబుల్ సమావేశం పిలుపు నిచ్చింది. భీమడోలు సీఐటీయూ కార్యాలయంలో శనివారం కేవీపీఎస్ మండల కన్వీనర్ టి.సుమన్‌బాబు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఆర్.లింగరాజు మాట్లాడుతూ మణిపూర్ లాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ప్రజా సంఘాలు సంఘటితంగా పోరాడాలన్నారు. ఈనెల 8న భీమడోలు రైల్వే గేటు నుంచి ప్రజాసంఘాల ప్రతినిధులు, ప్రజలంతా శాంతి ర్యాలీ చేస్తూ భీమడోలు జంక్షన్‌లో మానవహారంగా ఏర్పడి సంఘీభావాన్ని తెలుపుతారని వైసీపీ రాష్ట్ర కార్యదర్శి ముళ్లగిరి జాన్సన్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పాస్టర్ల అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు డీపీ రత్నం, యెషయ్యా, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు యర్రంశెట్టి ఏడుకొండలు, న్యాయవాద సంఘం జిల్లా నాయకులు పి.రాజారావు, రైతు సంఘం నాయకులు కట్టా భాస్కరరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు జి.ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.



భీమడోలులో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఐక్యత చాటుతున్న నాయకులు

7న ఏలూరులో ర్యాలీ

ఏలూరు (ఆర్ఆర్‌పేట): చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత, జౌళి శాఖ ఆధ్వర్యంలో ఈనెల 7న నగరంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నట్లు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా చేనేత, జౌళి శాఖ అధికారి ఎస్. రఘునంద తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ కార్యాలయం నుంచి ఉదయం 9.30 గంటలకు ర్యాలీ ప్రారంభమవుతుందని చేనేత కార్మికులు ఈ ర్యాలీలో పాల్గొంటారని తెలిపారు. ర్యాలీ అనంతరం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో ఇరువురు చేనేత కార్మికులను సత్కరించనున్నట్లు తెలిపారు. కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ఆప్కో సంస్థ చేనేత వస్త్ర ప్రదర్శన నిర్వహించి, చేనేత వస్త్రాల విక్రయిస్తామని తెలిపారు.

ఎండాకు తెగులు సోకిన పొలాల పరిశీలన

భీమడోలు: ఎండాకు తెగులు సోకిన వరి చేల్లో యూరియా పాళ్లను తగ్గించుకోవాలని ఏరువాక కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్ అన్నారు. భీమడోలు మండల వ్యవసాయాధికారిణి ఎస్‌పీవీ ఉషారాణి ఆధ్వర్యంలో శనివారం ఇటీవల వర్షాలకు ముంపుబారిన పడిన వరి చేలను ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ టి .సుజాతతో కలిసి ఆయన పరిశీలించారు. మండల వ్యాప్తంగా వరి పంటకు ఎండాకు తెగులు సోకినట్లు గుర్తించామని, దీని నివారణకు రెండు గ్రాముల కాపర్ హైడ్రాక్సైడ్‌ను ఒక లీటర్ నీటితో కలిపి పిచికారీ చేయాలన్నారు. ఒక గ్రాము ప్లంటామైసిన్‌ను లీటర్ నీటితో కలిసి వరి చేలో పిచికారీ చేయాలన్నారు. ముంపు బారిన పొలాల్లో 20 కేజీల యూరియా, 20 కేజీల పొటాష్‌ను బూస్టర్ డోస్‌గా వేస్తే నేల గట్టిపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.



భీమడోలులో ఎండాకు తెగులును పరిశీలిస్తున్న సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ కె.ఫణికుమార్

విద్యార్థులంతా క్షేమం



విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని పరీక్షిస్తున్న డాక్టర్ మాధవి

పెదవేగి : వాతావరణ మార్పు, సరిగ్గా నీరు తాగక విద్యార్థులు అస్వస్థత గురైన ఉదంతంపై ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి స్పందించి చర్యలు చేపట్టడంతో ఏ ప్రమాదం జరగకుండా విద్యార్థులంతా క్షేమంగా ఉన్నారని పెదవేగి పీహెచ్‌సీ వైద్యాధికారిణి మాధవి చెప్పారు. శుక్రవారం రాత్రి పెదవేగి నవోదయ విద్యాలయంలో కొంత మంది విద్యార్థులు అస్వస్థతకు గురైన విషయం విదితమే. శనివారం జ్వరం, కడుపునొప్పితో బాధపడుతున్న 25 మందిని పెదవేగి నవోదయ విద్యాలయం నుంచి జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించినట్లు వైద్యులు తెలిపారు. నిన్న రాత్రి వివిధ కారణాలతో ఏలూరు తరలించిన 15 విద్యార్థులు తిరిగి విద్యాలయానికి వచ్చారని, ప్రస్తుతం ఎవరికీ ఏ ఇబ్బంది లేదని డాక్టర్ మాధవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయ అధికారి జీ రాజ్‌మనోజ్ పంచాయతీ సిబ్బందిని అప్రమత్తం చేసి, నవోదయ ప్రాంగణంలో బ్లీచింగ్ చల్లించి పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వైద్యులు 24 గంటలు విద్యాలయ ప్రాంగణంలోనే ఉంటూ విద్యార్థులకు విశేష సేవలందిస్తున్న తీరును ఎమ్మెల్యే ప్రశంసించి, అభినందించారు.

ఉపాధి హామీ పథకం పనులపై సమీక్ష

పెదవేగి : ఉపాధి హామీ కింద వచ్చే కొత్త పనులు గుర్తించి అడిగిన వారందరికీ పని కల్పించాలని పెదవేగి ఎంపీడీఓ జి రాజ్‌మనోజ్ అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం అమలు సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ సిబ్బందితో ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లో ఉపాధి పనుల్లో భాగంగా రైతులకు ఉపయోగపడే పనులు చేపట్టాలని కోరారు. ప్రతి గృహ లబ్ధిదారుడికి 90 రోజులు పని దినాలు కల్పించాలన్నారు. సెప్టెంబర్‌లో సామాజిక తనిఖీ ఉన్నందున అందుకు తగిన విధంగా వర్క్ ఫైల్స్ సిద్ధం చేయాలని సిబ్బందిని ఎంపీడీఓ ఆదేశించారు. ఈ సమావేశంలో ఏపీఓ హేమలత, టీఏలు, ఎఫ్ఏలు పాల్గొన్నారు.